క్లుప్తంగా

ఘనంగా రెవెన్యూ దినోత్సవం



కేక్‌కట్ చేస్తున్న తహసీల్దార్, డీటీ

అద్దంకి రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా తహసీల్దార్ షేక్ మహబూబ్‌సుభాని, డిటీ సుధారాణిలు కేక్ కట్‌చేసి అందరికి పంచిపెట్టారు. అనంతరం రిటైర్డు సీనియర్ అసిస్టెంట్ పి. బ్రహ్మానందాన్ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌వో అమర్‌నాథ్, ఎంఆర్ఐ రామారావు, వీఆర్‌వో, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



వేమవరంలో భూసార పరీక్షలు చేయిస్తున్న ఏవో

బల్లికురవ: భూసార పరీక్షలతో భూమిలో ఉన్న లోపాలు తెలుసుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారిణి ఎస్‌వీపి కుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని 20 రైతు భరోసా కేంద్రంలో భూసార పరీక్షలు చేపట్టారు. ఒక్కో ఆర్‌బీకెలో 40 మంది రైతులకు సంబంధించి శాంపిల్స్ తీసి బాపట్ల ల్యాబ్‌కు పరీక్షకు పంపుతామని కుమారి వివరించారు. రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



యోగా చేస్తున్న కూలీలు ఉపాధి సచివాలయ సిబ్బంది



చందలూరులో..



చినగంజాం జెడ్పీ పాఠశాలలో యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- శారీరక, మానసిక ఉల్లాసానికి యోగా
- యోగా విశిష్టతను చాటిన విద్యార్థులు, ఉద్యోగులు
- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

కారంచేడు/మార్టూరు/చినగంజాం/యద్దనపూడి: ప్రతి ఒక్కరి శారీరక, మానసికమైన ఉల్లాసానికి యోగ ప్రధానంగా ఉపయోగపడుతుందని కారంచేడు ఎంఈఓ-2 మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రం కారంచేడు ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యోగా గురువు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. ప్రతి రోజు ఉదయం యోగా, ఆసనాలు, మెడిటేషన్ వలన అనేకమైన ఉపయోగాలున్నాయన్నారు. మంచి శారీరక ధృఢత్వంతో పాటు, శరీరంలోని అన్ని అవయవాలు ఎంతో చురుగ్గా ఉంటాయన్నారు. మండంలోని కుంకలమర్రు మొయిన్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగాడేను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో సువర్ణబాబు, వసుధ, సృజన, ఆశాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఏఎస్ఎంలు పాల్గొన్నారు.

■ పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పర్చూరు జూనియర్ సివిల్ కోర్టు ఆధ్వర్యంలో యోగాడే నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి పీ శాంతి మాట్లాడుతూ యోగా చేయడం వలన ఆరోగ్యంగా జీవిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ యోగాని దైనందిన కార్యక్రమంగా అలవరుచుకోవాలని కోరారు. రోటరీ ఉపాధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ యోగాకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చి దాని ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెప్పారని ప్రశంసించారు. పాబోలు వెంకన్న గురువుగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు దగ్గుబాటి రమణి, న్యాయవాదులు పాల్గొన్నారు. ఇంకొల్లు ఉన్నత పాఠశాల ఇడుపులపాడులో హెచ్ఎం పిడపర్తి పేరిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు వసంత రఘుబాబు ఆధ్వర్యంలో యోగాడే నిర్వహించారు.



బొబ్బేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

■ చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగా గురువు వలివేటి రామానుజం విద్యార్థులచే యోగాసనాలు వేయించి ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం టి .రత్నకుమారి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ మార్టూరు మండలం వలపర్ల, బొబ్బేపల్లి, కోనంకి తదితర గ్రామాల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. యోగా ద్వారా మానసిక శారీరక ఒత్తిడిలను ఎలా అధిగమించవచ్చో అవగాహన కల్పించారు. స్థానిక హర్షిని విద్యాసంస్థల ఆవరణలో ప్రిన్సిపాల్ గద్ద ఆంజనేయులు, మార్టూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులచే యోగాసనాలు వేయించి అవగాహన కల్పించారు.



బీబీహెచ్ జూనియర్ కళాశాల్లో సామూహిక యోగాసనాలు వేసిన విద్యార్థులు



చీరాలలో యోగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

యోగాతో జీవితంలో పెనుమార్పులు..

అద్దంకి/అద్దంకి రూరల్/జే.పంగులూరు/బల్లికురవ/మేదరమెట్ల: అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా ఉపాధి హామీ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని బొమ్మనంపాడు గ్రామంలోని అమృత సరోవర్ వద్ద యోగా దినోత్సవాన్ని ఉపాధి హామీ ఏపీవో గాయత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో జీవీ సత్యనారాయణ హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నిత్య జీవితంలో యోగా వలన ఎన్నో ప్రయోజనాలున్నాయని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ పథక సిబ్బంది పాల్గొన్నారు. బల్లికురవ మండలం పెదఅంబడిపూడి ఉన్నత పాఠశాల హెచ్ఎం జీ. శివలింగారావు ఆధ్వర్యంలో యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అద్దంకి మండలం మైలవరం జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులు, లావణ్య, నాగేశ్వరరరావు ఆధ్వర్యంలో యోగాడే నిర్వహించారు. స్థానిక కేఆర్కే డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ వీ మోహన్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని విద్యార్థులచే యోగాసనాలు, సూర్యనమస్కారాలు, ప్రాణాయామం చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శిఖామణి అల్లాడి, వీ ప్రసాద్, ఎంవీ సత్యనారాయణ, పీవీ హేమలత, ఎన్ఎస్ఎస్ విభాగం సభ్యులు పాల్గొన్నారు. జే.పంగులూరు మండల పరిధిలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగాడే నిర్వహించారు.

యోగాతో మానసిక ప్రశాంతత..

చీరాల టౌన్/వేటపాలెం: ప్రతీరోజు యోగా చేయడం వలన మానసిక రుగ్మతలు తొలగి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవిస్తారని చీరాల నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ పావని సూచించారు. జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నారాయణ స్కూల్లో విద్యార్థులు యోగా విన్యాసాలతో పాటుగా యోగా విశిష్టతలను వివరించారు.



ఇడుపులపాడు పాఠశాలలో యోగాసనంలో విద్యార్థులు

■ వేటపాలెం మండలం పరిదిలోని వివిధ ప్రాంతాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి విద్యార్థుల చేత యోగాసనాలు వేయించారు. స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో యోగా దినోత్సవం నిర్వహించారు. కరస్పాం డెంట్ ఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి రోజు యోగాసనాలు వేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు.

చీరాల రూరల్ : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కోర్టు భవన సముదాయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ యోగా గురువులు ఎస్. శివ రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో యోగా క్లాసులు నిర్వహించారు. న్యాయమూర్తులు ఎం. సుధ, షేక్ రెహాన, షేక నిషాద్‌నాజ్‌లతో పాటు న్యాయవాదులు, సిబ్బంది హాజరయ్యారు.

చీరాల అర్బన్: పేరాలలోని ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం బి.సాల్మన్ ఆధ్వర్యంలో యోగాడే నిర్వహించారు. సత్యసాయి ధ్యానమండలి ఆధ్వర్యంలో వాసవీక్లబ్, ఆర్ఎస్ఎస్, నెహ్రూ యువకేంద్రం, రోటరీ క్లబ్ చీరాల, వాకర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం చీరాలలో ర్యాలీ నిర్వహించారు. గడియార స్థంభం సెంటర్‌లో మానవహారం నిర్వహించారు.

వాడవాడలా ఏరువాక పౌర్ణమి

బల్లికురవ: వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించేందుకు గణపతిని ఆరాధించి వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టాలని సూరేపల్లి గణపతి ఆలయ అర్చకులు కుందుర్తి శ్రీనివాసరావు అన్నారు. ఎరువాక పున్నమి సందర్భంగా సూరేపల్లి గ్రామంలో మహాగణపతి, వీరగణపతి, లక్ష్మీ గణపతి, ఆలయంలో రైతులు ప్రత్యేక పూజలు చేపట్టారు. పాడి పంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని స్వామివార్ల ముందు ఉండ్రాళ్ల పోసి నివేదించారు. అనంతరం డప్పు వాయిద్యాలతో గ్రామోత్సవంగా పొలాలకు వెళ్లి ఆ ఉండ్రాళ్లను పొలాల్లో చల్లారు. ఈసందర్భంలో గ్రామానికి చెందిన రైతు కారసాని శివారెడ్డి మాట్లాడుతూ అనాదిగా తాతముత్తాతల కాలం నుంచి ఎరువాక పున్నమిరోజు విఘ్నాలు తొలగాలని గ్రామంలోని గణపతి ఆలయంలో పూజల తదుపరి నివేదించిన ఉండ్రాళ్లను పొలాల్లో చల్లుతున్నట్లు వివరించారు. పున్నమి వేడుకలతో గ్రామంలో ప్రతి ఇంటా పండగ వాతావరణం నెలకొంది. వైదన, కూకట్లపల్లి, వెలమవారి పాలెం గ్రామాల్లో కూడా పున్నమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు వినాయకుని ఆలయంలో శుక్రవారం ఏరువాక ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ రైతులు ట్రాక్టర్లు, ఎద్దులను వినాయకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.



గర్భగుడిలో పూజలందుకుంటున్న గణనాథులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేటపాలెం: 11 కేవీ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. దేశాయిపేట, వేటపాలెం పంచాయతీల పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్, ఐటీఐ కాలనీ, ప్రసాద్‌పేట, రామానగర్, విజయనగర్ కాలనీ, మంకెనవారిపాలెం, చిన్న బజార్, రెడ్డబజార్, లైబ్రరీ రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, సెంటర్ వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తారని తెలిపారు. వినియోగదారులు గమనించాలని సూచించారు.

నేటి నుంచి సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు

చీరాల రూరల్: స్థానిక ఎస్‌జె. రంగనాయకులు, బాపనమ్మ కళ్యాణ మండపం నందు 22, 23 తేదిలలో సీపీఎం పార్టీ ముఖ్య కార్యకర్తల జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి నలతోటి బాబురావు శుక్రవారం తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు బాపట్ల జిల్లాలోని 25 మండలాల నుంచి 200 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు చెప్పారు. కొత్తగా ఏర్పడిన బాపట్లలో జిల్లాలో ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లేందుకు, మారిన రాజకీయ పరిస్థితుల్లో ఉత్పన్నమయ్యే ప్రజా సమస్యలు, ప్రజలపై ఉదారవాద విధానాలు ప్రభావం తదితర అంశాలపై తరగతులు జరుగుతాయని చెప్పారు. అలానే జిల్లా అభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో జరిపే ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఈ శిక్షణా తరగతులు ఉపయోగపడతాయని చెప్పారు. అలాగే పార్టీ బలోపేతానికి కృషి చేసేలా శిక్షణ తరగతులు నిర్వహిస్తారని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాడేందుకు అవసరమైన శిక్షణ కూడా ఇస్తారని ఆయన తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు సీపీఎం రాష్ట్ర నాయకులు డి. రమాదేవి, వై. సద్దయ్య, జిల్లా నాయకులు గంగయ్య, మణిలాల్, టి. కృష్ణమోహన్, మషధర్‌లు హాజరై తమ సందేశాలను అందజేస్తారని ఆయన పేర్కొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

చీరాల రూరల్: రాజీ మార్గమే రాజమార్గమని.. కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసులను లోక్ అదాలత్‌ల ద్వారా రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ పేర్కొన్నారు. స్థానిక కోర్టు భవన సముదాయంలోని బార్ అసోసియేషన్ హాలులో శుక్రవారం న్యాయవాదులతో న్యాయమూర్తులు సమావేశం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయమూర్తులు సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహానా, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ నిషాద్ నాజ్‌లు పాల్గొని మాట్లాడారు. ఈనెల 29న కోర్టు ప్రాంగణంలో జరిగే జాతీయ లోక్ అదాలత్‌కు న్యాయవాదులతో పాటు కక్షిదారులు సహకరించాలని సూచించారు. లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోదగిన అన్ని సివిల్, క్రిమినల్ కేసులైన చెక్ బౌన్స్ కేసులు, భార్యాభర్తల కేసులు, కొట్లాటలు, కుటుంబ తగాదాల కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు, బ్యాంకు రుణాల కేసులు, యాక్సిడెంట్ కేసులు వంటివాటిని రాజీ మార్గంలో అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని వారు సూచించారు. రాజీ మార్గంలో పరిష్కరించిన కేసులపై ఇతర కోర్టులకు అప్పీలుకు వెళ్లే అవకాశం లేదన్నారు. లోక్ అదాలత్‌లలో న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పులే అంతిమ తీర్పులుగా వారు పేర్కొన్నారు. కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తులు కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సుధ

25న ప్రభుత్వ ఉద్యోగుల సంఘ సమావేశం

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చీరాల తాలూకా జనరల్ బాడీ సమావేశం ఈనెల 25న డ్రైనేజి డివిజనల్ కార్యాలయం అతిథి గృహంలో ఏర్పాటు చేసినట్లు చీరాల తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు దేవర వినోద్, కావూరి శ్రీనివాసరావులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి బాపట్ల జిల్లా అధ్యక్షులు కె.రోశయ్య, కార్యదర్శి పి.శ్రీనివాసరావులు హాజరవుతారన్నారు. చీరాల తాలూకాలో వివిధ ప్రభుత్వ విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ హాజరుకావాలని కోరారు.

వైభవంగా కనక నాగవరపమ్మ శిడిమహోత్సవం

వేటపాలెం: మండల పరిధిలోని రామన్నపేట శివారు పంటపొలాల్లో వేంచేసియున్న కనక నాగవరపమ్మ అమ్మవారి శిడి మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రతేక పూజలు నిర్వహించారు. సంతరావూరు నుంచి తరలించిన శిడిమాను కర్రకు గల బాక్సులో శిడిపోతును ఉంచి అమ్మవారి అలయం చుట్టు మూడు సార్లు ప్రదర్శన చేశారు. శిడి మహోత్సవాన్ని తిలకించడాకి చుట్టు పక్కల గ్రామాలైన పందిళ్లపల్లి, కడవకుదురు, చిన్నగంజాం, జాండ్రపేట, వేటపాలెం, సంతరావూరు, చీరాల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అలయానికి తరలి వచ్చారు. భక్తులు పొంగళ్ల చెల్లించి అమ్మవారికి మొక్కులు తీర్చుకొన్నారు. రైతులు వారి ఆవులు, ఎద్దులు, మేకలను అమ్మవారి గుడి చుట్టు ప్రదక్షిణ చేయించి మొక్కులు తీర్చుకొన్నారు. రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, వేటపాలెం ఎస్సై జీ సురేష్, ఆధ్వర్యంలో పోలీసులు శాంతి, భద్రతలు పర్యవేక్షించారు.



శిడిమహోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సీజనల్ వ్యాధులు సోకకుండా చర్యలు

బల్లికురవ: జూన్ నుంచి ఆగస్టు వరకు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని అప్రమత్తంగా ఉండాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ కోరారు. శుక్రవారం ఉప్పుమాగులూరు 1 సచివాలయం పరిధిలో 104 క్యాంపు నిర్వహించారు. షుగరు, బీపి, హిమోగ్లోబిన్ పరీక్షలతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సాయంత్రం శిబిరానికి రాలేని వృద్ధులు చిన్నారులను ఇంటింటికి వెళ్లి పరీక్షలు చేశారు. పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు ప్రాధాన్యత ఇవ్వాలని దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని వైద్యాధికారులు కోరారు. ఈక్యాంపులో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాలు క్షేమం

చీరాల టౌన్: వైద్యుల సూచనల, సలహాలు పాటిస్తే ప్రసవాలు సాధారణంగా జరగడంతో పాటుగా తల్లీబిడ్డ ఆరోగ్యంగా జీవిస్తారని ఈపూరుపాలెం పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి సూచించారు. ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం గ్రామంలోని 22 మంది గర్భిణులకు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలను చేశారు. ఈసందర్భంగా వైద్యులు శ్రీదేవి మాట్లాడుతుతూ గర్భిణులు 20 రోజులకు ఒకసారి విధిగా వైద్యుల వద్ద సేవలు పొందాలన్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడంతో పాటుగా పాలు, గుడ్లు, ఆకుకూరలు, బెల్లం విధిగా రోజువారీ ఆహారంలో ఉండాలన్నారు. కరోనా ప్రభలుతున్నందున గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రసవాలు జరిగేంత వరకు గర్భిణులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు జరిగేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మెన్‌కు గాయాలు

అద్దంకి రూరల్: అద్దంకి సబ్ స్టేషన్ పరిధిలో అద్దంకి పట్టణంలో పనిచేస్తున్న లైన్‌మెన్‌కు విద్యుత్ షాక్ కొట్టి తీవ్రగాయాల పాలయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు లైన్‌మెన్‌గా పనిచేస్తున్న నగిరి నాగేశ్వరరావు శుక్రవారం సాయంత్రం అద్దంకి పట్టణంలోని బ్రహ్మానందం కాలనీ సమీపంలోని విద్యుత్ స్తంభం ఎక్కి పని చేస్తున్నాడు. అయితే పోల్‌పై నున్న మూడు తీగెల్లో ఒక దానికి విద్యుత్ సరఫరా ఆపు చేయకపోవటంతో షాక్ కొట్టి కిందపడ్డాడు. స్థానికులు వైద్యం కోసం హుటాహుటిన ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలలకు తరలించారు.